నికి సత్యనారాయణ సంగతి అప్పుడే స్ఫురించింది. ఇంటి లెక్కలన్నీ అతనికి తెలుసు. చంద్రశేఖరం విషయం కూడా అతనికి తెలియకుండా ఉండదు. అతన్ని కనుక్కుంటే ఎప్పుడో తేలిఉండేది! ఈ సంగతి అప్పుడు ఎందుకు స్ఫురించలేదు? అతనికి ఆశ్చర్యం కలిగింది.

ఇప్పుడైనా తేల్చుకోవచ్చును గదా అనుకొన్నాడు. వెంటనే తనకు ఆ విషయాన్ని గూర్చి తెలియచేయవలసినదని కోరుతూ ఉత్తరం వ్రాసి పోస్టులో వేయించగలిగాడు. ఉత్తరం చేయి దాటిపోయిన తరువాత అతనికి అనుమానం కలిగింది. సత్యనారాయణ తండ్రివద్ద గుమాస్తా. నిజం తెలిసిఉన్నా చెప్పాలని నియమమేమిటి? చెప్పాడని తెలిస్తే తండ్రి ఉద్యోగంలో ఉండనిస్తాడా? లేదు. లాభం లేదు. చెల్లెలు తల్లి కూడ తండ్రిపై గల పక్షపాతంతో అలా చెప్పారు. స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. మానవహృదయం ఎంత దుర్బలం. ఎలాంటి అబద్ధమైనా ఒకటికి పదిసార్లు ఒకరికి ఇద్దరు చెబితే నిజమని నమ్ముతుంది. కేవ్ ఆఫ్ ది మాసెన్‌లో చపాట్కిన్ ఇదేగదా వివరించింది. ఒకవేళ ఇందరు చెబుతున్నదీ నిజమనుకొన్నా తండ్రి తనతో అలాగే చెప్పినట్లు ఎందుకు జ్ఞాపకమున్నది? ఆయనమీద తనకేమి పగ? తండ్రి తనతో ఆనాడు అబద్ధం చెప్పాడా? చెప్పవలసిన అవసరం లేదు. ఇంతకూ సత్యనారాయణగారికి ఉత్తరం వ్రాయకుండా ఉంటేనే బాగుండేది. అనవసరంగా కుటుంబ వ్యవహారాలు నలుగురిలో పడవేయటం ఏమంత బాగున్నది? అయినా చేయి జారిపోయిన తరువాత అనుకొని ప్రయోజనమేమిటి? అయినా ఆయన ఏమి వ్రాస్తాడో చూడాలి అనుకొన్నాడు.

(ఇంకా వుంది)

స్కెచ్

# కొక్కిరాళ్లు

పండితారాధ్యుల పరంధామయ్య

బాలయ్య రొమాన్సు పత్రికలో లీనమైపోయాడు. అతడి సర్వేంద్రియాలు కథాగమనం వైపు కేంద్రీకరింపబడ్డవేమో—అతని చేతిలోని సగం కాలి చల్లారిపోయిన బీడీ అగ్నిసంస్కారం కోసం ఎదురు చూస్తూవుంది. పాత తుంగచాపపై గోడకు వీపు ఆనించి కూర్చొని తదేకదృష్టితో పత్రికను చూస్తున్నాడు. అతడిని చూడగానే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బంధించి యోగసమాధిలో వున్నాడా అనిపిస్తుంది. ఇంతలో అతని భార్య వరలక్ష్మమ్మ భుజంపై నీళ్ళబిందెతో వాకిలి వరకూ మంద గమనంతో వచ్చి నిలబడింది. బాలయ్య ఆమె అడుగుల చప్పుడు విన్నాడు. కాని—అవి వాకిలిదగ్గర ఆగిపోవటంతో— ఏదో ప్రమాదం వాటిల్ల గలదని తల్లడిల్లిపోయి తల ఎత్తి ఆమె ముఖాన్ని వీక్షించాడు. ఆమె ముఖంలో అతనికి మంచి లక్షణాలేవీ కనబడక పోవటంతో అతని గుండెల్లో యీమారు రైళ్లే పరుగెత్తినవి. ఎందుకయినా మంచిదని ముఖానికి పత్రిక అడ్డం పెట్టుకున్నాడు. వరలక్ష్మమ్మ యీ ధిక్కారాన్ని సహించలేక పోయింది.

"ఏమండోయి? ఎంత నిబ్బరంగా వున్నారండీ." ఆమె స్వరంలోని కటుత్వాన్ని బాలయ్య గమనించాడు.

"ఏమిటూ పెడబొబ్బలు— ఏదో మునిగినట్టు" మేకపోతు గాంభీర్యంతో అన్నాడు.

"ఏమీ లేకపోయినా దబాయింపులు మాత్రం వున్నయి. మనిషి జన్మెత్తాక సిగ్గంటూ వుండాలి." ఈ కడపటి ముక్క ఏదో ఒక విశేషముంటేగాని అనదని బాలయ్యకు తెలుసు. ఇక కథకు తిలోదకాలివ్వవలసిందే. విధిలేక పత్రికను మూసి—

"ఛా! చా! ఎప్పుడూ ఒకటే పోరు. ఈ కొంప కంటె నరకం మేలు, ఇంతకు ఏమిటీ?

త్వరగా ఆఘోరించు"

"నా రాత... నిన్ను పలకరించటమంతా నా తప్పే"

"బిందైనా లోపల పెట్టు. తర్వాత ఏడుస్తువు."

"నిన్ను కట్టుకొన్నాక అది తప్పేదేముంది."

"ఇంతకు ఏమి ముంచుక వచ్చిందో చెప్పవేం."

"ఊరంతా అట్టుడికినట్టు వుడుకుతుంటే నేను చెప్పాలట."

"చెప్పవూ! ఎందుకయితే యీ వెధవ చేష్టలు"

"ఆ స్వాములవారి దగ్గరకెళ్ళి యింత తీర్థం తెచ్చి తగలబెట్టండి."

"తీర్థమా! ఎందుకూ"

"తిప్పయ్యగారి దొడ్లో యీనాది, రెండు బేదులు రెండు వాంతులు అయి చచ్చాడుట."

"ఓరి- బాబో- కలరా!"

"ఇంకా ఏమనుకున్నారు. కదలరేం."

"తీర్థం వల్ల ఏమవుతుంది."

"అలా అంటారేమిటి. నోరు పడిపోదూ! అదృష్టంకొద్దీ మొగుడూ— భాగ్యంకొలది బిడ్డలన్నారు. వాగొంతు కోయలేక యిక్కడ తోలారు మావాళ్ళు."

"నన్నువుద్ధరించటానికి. నోరుకొవ్వినట్టుందే."

"కొవ్వకేంజేస్తుంది. ఆడదాని సొత్తుదింటూ"

"ఆ కూతే నిన్ను కూయవద్దనేది." బాలయ్యకు రోషం వచ్చింది.

"మహారాజుగా అంటాను. వందసార్లు అంటాను."

"అంటావు. అంటావు. రేపటిలో నీతిక్క కుదురుస్తా." బాలయ్య వుద్యోగానికి దరఖాస్తు పెట్టినప్పుడల్లా యిలా అనడం మామూలు.

"మనిషి జన్మెత్తాక సిగ్గంటూ వుండాలి. తెలివెటూ లేదనుకో. నా తిక్క కుదురుస్తాడట. ఇప్పటికి ఎన్నిసార్లో."

"ఇంతకూ నా కర్మ. వరలక్ష్మీ నన్ను చంపకు."

"ఆ, అస్తమానం నిన్ను చంపుతున్నా. స్వాములవారి దగ్గర కొంచెం తీర్థం పట్టుకరమ్మంటె"

"దాసుడను. యిదే వెళ్ళొస్తా, శాంతించు."

"ఆ బుద్ధి ముందుంటె."

బాలయ్య దేబిరిముఖంతో వాకిలి దాటాడు. వరలక్ష్మి రీవితో బిందెతో సహా యింట్లోకి ప్రవేశించింది.

ఆ రోజు సాయంత్రం వరలక్ష్మమ్మ వడ్డిస్తోంది. బాలయ్య గంభీరంగా పీటమీదకూర్చుని వున్నాడు.

"నీళ్ళు కాచావా? కాగిన నీళ్ళు కావాలి."

"కాయాలేదు, వడపోయాలేదు. తులసి తీర్థం కలిపా."

ఎంత చెడ్డా స్కూలు ఫైనలు క్లాసును మూడేండ్లు తిరుగదోడిన బాలయ్యకు నవ్వొచ్చింది.

"తులసినీళ్ళు కలిపితే పురుగులు చస్తాయా."

"ఏమిటా మాటలు అన్నం తింటూ. ఎక్కడున్నాయి పురుగులు. స్వాములవారి బావికి పోయి నీళ్ళు తెస్తే. అబ్బ! యిప్పటికీ కాళ్ళు పీకుతున్నాయి. అరమైలు పోయి రావటం మాటలా!"

"దగ్గర మంచినీళ్ళ బావి పెట్టుకొని అక్కడకెందుకెళ్ళావు."

"మాల-మాదిగ ఏకమంగలమయితే. అదీగాక ఆ బావిలో మందు కలిపారు."

"ఓహో అదా సంగతి! అయితే స్వాములవారి బావిలో..."

"స్వాములవారు బావికి అడ్డం పడ్డారట మందు కలపొద్దని. వూళ్ళోవాళ్ళు సగానికిపైగా స్వాములవారి బావికొస్తున్నారు నీళ్ళకి."

"ఇందాక గోపి కనబడి నీళ్ళు కాచి తాగమంటేను, చెప్పాలే"

"ఆ వెధవ యిందాక మనింటికికూడా వచ్చి సూది వేయించుకోమన్నాడు. రెండు చీవాట్లతో సాగనంపాను."

"మంచోడేనే పాపం."

"ఆ కేపుమారి. ఆహా, ఇంకేం. నీ వొక వీరాగ్రేసరుడివి. వాడొక త్యాగమూర్తి. స్వాములవారిని పట్టుకొని నానా మాటలు అడిగాడుట."

"తప్పంటే అడుగుతాడు. స్వాములవారైతే నేం?"

"నోరు పడిపోను, అలా మాట్లాడతా వేమిటి."

"నీదంతా పిచ్చి."

"నీదంతా వెర్రి కాదూ?"

"సరేలే. వూరుకుండు."

"కేపుమారి వెధవ కాకపోతే, బ్రాహ్మణ బావిలో మందు కలుపుతాడు? మాల మాదిగ అని వెంటేసుకుని వచ్చి—" వరలక్ష్మి తరవాత ఏమనాలో తెలియక పులుసు గిన్నెలో గరిటెను గరగరా తిప్పింది.

"కలరా అంటువ్యాధికదూ అం[illegible]త్రం" ముద్దను తాపీగా మింగాడు బాలయ్య.

"స్వాములవారి తీర్థం చాలదుటంటే మీ పిచ్చి కాకపోతే."

"తెలుస్తుంది లే."

"తెలియకేం నేడు కాకపోతే రేపైనా."

రెండురోజుల తర్వాత ఒక మధ్యాహ్నం బాలయ్య పీన పుల్లలు చీలుస్తుంటే వరలక్ష్మమ్మ విస్తళ్లు కుట్టుతూంది.

"స్వాములవారి అమ్మాయికి కలరా తగిలిందటనే."

"ఇక తెలుస్తుందిగా స్వాములవారి మహత్తు. వారు తులసితీర్థం తప్ప మరేమీ యివ్వటం లేదుట."

"గోపి అక్కడకుకూడ వెళ్ళాడటనే."

"వెళ్ళాడుట కేపుమారి వెధవ. మందు కూడా వేస్తానన్నాడట. స్వాములవారు మొహంమీద కొట్టి పంపాడుట."

"ఎట్లా? నాకు తెలియదే ఆమెకు కలరా తగిలినప్పటినుండి ఆబావి కెవరూ నీళ్ళకు పోవడం లేదటనే"

"నీళ్ళలో ఏముంది. భయమేసి పోలేదేమో, ఇంతకు ఆయుస్సుండాలిగాని"

"నీవింకా ఆనీళ్ళే తెస్తున్నావేం కొంపదీసి."

"చాలదూరం ఎవరు తెస్తారని విధిలేక ఈ బావినీళ్ళే తెస్తున్నా—"

"మంచిపని జేశావు. లేకపోతే వెధవ కలరా పిల్చు మింగలేక చస్తును. ఐతే స్వాముల వారు ఆ అమ్మాయిని దేవాలయం ముందు పడ వేసి ఒంటికాలుపై నిల్చొని ధ్యానిస్తున్నాడటనే."

"అవునటండి. ఆ దెబ్బతో గాని ఆ జబ్బు తిరుగుముఖం పెట్టదట."

"ఇంకా తిరుగుముఖమెక్కి? హంస లేచిపోయిందట."

"ఛా! ఛా! అలా మాట్లాడుతా వేమిటి? ఆమె బ్రతుకుతుంది."

"ఆమె ఎప్పుడో భగవత్సాన్నిధ్యం చేరింది."

"అబద్ధం."

"దేవళందాకా రా. నీకే తెలుస్తుంది."

"ఓయ్ బాబో. నేను రాను.

"ప్రతిష్ఠకోసం మందులేకుండా చంపాడు కూతుర్ని"

"ఆఖరున వొప్పుకున్నాడుట స్వాముల వారు మందివ్వటానికి. కాని ఆ అమ్మాయి ససేమిరా అన్నదట."

"మూర్ఖం. ఉగ్గుపాలతో చెత్త విశ్వాసాలని నూరిపోస్తిరి. ఇప్పుడు మారటం అంత సులభమా, సమగ్ర విజ్ఞానంలేని ప్రబలవిశ్వాసం ఎప్పుడూ ప్రమాదమే."

"మాణిక్యంలాంటి పిల్ల. గోపీగాడుకూడా చాలా బతిమాలాడట మందు తీసుకోమని."

"గోపి కేపుమారి వెధవని అంటివే."

"ఇప్పుడు మాత్రం."

"రాత్రింబగళ్ళు విరామంలేకుండా ప్రజలకు సేవజేసినవాడా కేపుమారి—"

"వాడి సేవ నీవు పొగడాల్సిందే వూరంతా యెంగిలిమంగలం చేస్తే."

"నీ చాదస్తం చాలించు"

"నీవు పాషండుడివిగా మాట్లాడుతున్నావు."

"నీ చాదస్తంకంటె అదే నయం"

"నీ పాపిష్ఠితనంకంటె అదే నయం."

"నీ మొండివాదం కట్టిపెట్టు"

"నీ పిడివాదం విడిచిపెట్టు."

"ఛీ!" బాలయ్య పీనకర్రల కట్టతో లేవగా—ధూత్ అంటూ వరలక్ష్మమ్మ విస్తరాకుల్ని చేతిలోకితీసుకుంది. ఇంతలో పొరుగింటి పుల్లమ్మ రావటంతో వారి యుద్ధప్రయత్నం టక్కున ఆగిపోయింది.